"ప్రేమించే హృదయం చాలు"

"-కృష్ణజ"

ప్రియ తుషారా!

స్వాతి వానకై వేచే ముత్యపు చిప్పలా, వెన్నెల కోసం ఎదురు చూసే చకోరంలా నీ చల్లని చూపుకై, తీయని చిరునవ్వుకై పరితపించే ఈ దీనుడ్ని ఎప్పుడు కరుణిస్తావు....?

తుషా... నీ అందంతో నన్ను ఊరిస్తున్నావు నీ నిర్లక్ష్యంతో నన్ను వేధిస్తున్నావు . ఇది న్యాయమా....?

కోటి సినిమా తారలకైనా లేని నీ అందం నన్ను పిచ్చివాణ్ని చేస్తోంది ప్రేమ బిచ్చగాడ్ని చేస్తోంది.... నీ కరుణ నాపై కలగని నాడు, నాకు మరణమే శరణం...

ఇట్లు
నీ ప్రేమ పూజారి–
"సుమన్"

"డియర్ శారా...

పడవ లాంటి కారులో నుండి హంసలా నువ్వు దిగుతోంటే నా గుండె లయ తప్పుతోంది ..

మై హార్ట్ ... మై లవ్ ... మై...."

అది, అలాంటివే మరో కొన్ని ఉత్తరాలు చదివి నిర్లక్ష్యంగా టేబిల్ మీదికి విసిరేసి ప్రక్కనే వున్న నీరజ వంక చూసి అర్థయుక్తంగా నవ్వింది తుషార....

ప్రతిగా తనూ ఓ చిరునవ్వు విసిరింది నీరజ.

'అబ్బబ్బ ... ఈ లౌ లెటర్స్‌తో చచ్చిపోతున్నానే నీరూ..." కానీ, ఆ చచ్చిపోతున్న లక్షణాలేవీ తుషార ముఖంలో కనిపించ లేదు.

"ఊఁ... చదువూ, సంపదా, సౌందర్యం స్వంతం చేసుకున్న అమ్మడివి. నీకు కాక మరెవరికొస్తాయి లౌ లెటర్స్... "

"అఫ్‌కోర్స్ .. ." అన్నట్లుగా నవ్వింది తుషార

ఈ కాంప్లిమెంట్ ఆమెను సంతోష పరచింది అన్నట్లుగా కళకళ లాడుతున్న ఆమె ముఖం చెప్పకనే చెప్పింది

"పోనీ, తుషారా! ఓ పని చెయ్యకూడదా... ?"

"ఏవిఁటి.. ?" అన్నట్లుగా కళ్ళు రెపరెప లాడించింది తుషార. ఆ కంటి రెపరెపలు చూసిన కుర్రాళ్ళు వెర్రెత్తి పోతే ఆశ్చర్యం లేదు

సుమన్ వర్ణించినట్లుగా కోటి సినిమా తారల సౌందర్యమూ ఒక్క తుషార సొత్తు ...

కలువ పూరేకుల కళ్ళు, అరుణారుణ కాంతులీనే చెక్కిళ్ళు పూరేకుల పెదవులు, సంపంగి నాసిక, వంగిన విల్లులాంటి కనుబొమల తీరూ, వర్షబుతువులోని మేఘ పంక్తిని పోలిన దట్టమైన కేశ సంపదా, సన్నని నడుము వంపూ .. తుషార కేవలం అజంతా శిల్పం .

రమణీయమైన శిల్పం..

ఆమె అందం అనన్య సామాన్యం .. అందుకే తుషార మిస్ కాలేజ్ అయ్యింది. కుర్రాళ్ళ కలత నిద్దురకు కారణం అయ్యింది

కలిమి తెచ్చిన ఆడంబరంతో అందరిలోనూ ప్రత్యేకంగా కనిపించే తుషార చదువులో కూడా ఎవరికి తీసిపోదు.

క్లాసులో ఆమె ర్యాంక్ మూడుకు పెరగదు లక్ష్మి, సరస్వతులు ఒక్క చోట కాపురం చెయ్యరనేది పెద్దల మాట కానీ, తుషార విషయంలో ఆ ఇద్దరే కాకుండా రతీదేవిని కూడా తోడు తెచ్చుకుని ముగ్గురూ కలిసి ముచ్చటగా కాలక్షేపం చేస్తున్నారు. కానీ, విచారించాల్సిన విషయం ఏమంటే తుషారకు తన అందం తనకు తెలుసు

ప్రతి కదలికలోనూ తన సౌందర్య సంపదలోని విశిష్టతను ఎదుటి వారు గమనించేలా ప్రవర్తిస్తుంది.

"ఏమిటే నీరూ, ఏమిటో చెప్తానని అలా రెప్ప వాల్చకుండా చూస్తూండి పోయావ్.. ?"

నీరజ అలా ఎందుకు చూస్తుండి పోయిందో తుషారకు తెలుసు

"అహఁ .. అఁ.. ఏమీ లేదు "

"నీ అందాన్ని " అని వుంటే సంతోషించేది తుషార

"ఏవిటి చెప్తానన్నావ్.. ?"

"అబ్బే.. ఏమీలేదు.. నీకు నచ్చిన, నిన్ను మెచ్చిన ఓ కుర్రాడ్ని చూసి ప్రేమించేయ్ఁ అంతటితో నీకి ప్రేమ లేఖల బెడద తప్పుతుంది కదూ.. ?"

నిర్లక్ష్యంగా ఓ నవ్వు నవ్వింది తుషార – కడలి తీరంలో ఓ అల విరిగి పడ్డట్లు . వినీలాకాశంలో ఓ మెరుపు మెరిసినట్లు. ..

"ఏమిటి .? ప్రేమా ..? వీళ్ళనా.. ?"

మరోసారి నవ్వింది తుషార. తెల్లబోయినట్లు చూస్తూండి పోయింది నీరజ

"నీరూ డియర్! నా మేరేజ్ ఇలాంటి వాళ్ళతో అవుతుందని ఎలా అనుకుంటున్నావ్. ? మా డాడీ నా కోసం అందమూ, ఐశ్వర్యమూ వున్న ఓ ఫారిన్ రిటర్న్‌ను సెలెక్ట్ చేస్తారు ..'

"సెలెక్ట్ చేయడం కాదు . కొంటారను...."

"అఫ్‌కోర్స్.. ."

"తుషారా! నేనిక వెడతాను. .

"అరే. టిఫిన్ తీసుకుని వెడతావనుకుంటే . అప్పుడే వెడతానంటావేం?" డ్రైవర్ని పిలుస్తాను, కారులో వెడుదువు గాని ..."

తుషారకు ఓ ఎఱ్ఱరంగు అందమైన కారు వుంది.

"ఇప్పుడేం వద్దు తుషారా .. నేను వెళ్ళాలి. "

"మా ఇంటికి వచ్చిన వాళ్ళు కాఫీ టిఫిన్ తీసుకోకుండా వెళ్ళడమే .. మా డాడీ ఊరుకోరు ."

ఆ మర్యాదలో ఆప్యాయత ఉండదు . కేవలం

స్టేటస్ సింబల్.. అప్పటి కప్పుడు తుషార వంట మనిషిని పిలిచి టిఫిన్, నెస్కేఫ్ తెప్పించింది.

బాదం హల్వా ... జీడిపప్పు పకోడి.. తుషార అందంలా.. ఆమె అంతస్థులా..

"నీరూ శేఖర్ లేడూ.. ఆ పల్లవి వెంట తిరుగుతున్నాడు.. . అసహ్యంగా...."

"ఇందులో అసహ్యం ఏముంది.. .?" అన్నట్టుగా చూసింది నీరజ.

"అసలా పల్లవి ఎలా వుంటుంది. ? ఆ ఫుల్‌వాయిల్ చీరల్లో తనను చూస్తుంటే పగలు చూస్తే రాత్రికి కల్లోకి వస్తుంది ఓ అందమా...? ఆకారమా.. ? శేఖర్ తనలో ఏం చూసి లైక్ చేస్తున్నాడో.. ?"

"శేఖర్ పల్లవిని ప్రేమిస్తున్నాడేమో..."

"అదే నేనూ అంటున్నాను ఓ అందమా ...? డబ్బా...? తెలివితేటలూ అంతంత మాత్రమే.. మరి శేఖర్ ఏం చూసి ప్రేమిస్తున్నాడో పూర్‌ఫెలో..."

"తుషారా! అందరూ నీలాగే ఎలా వుంటారు. ? పల్లవి చాలా మంచి అమ్మాయి. శేఖర్ ఆమె మంచి మనస్సు చూసి ప్రేమిస్తూండవచ్చు...."

ఈ మాటలు తుషారకు నచ్చలేదని ఆమె ముఖమే చెబుతోంది.

"ఏం మంచి మనస్సో.... ఏమో... మరి ఎబ్రాసి ముఖమూ... తనూ...."

నీరజ ఆశ్చర్యంగా చూసింది.

తుషార అన్నట్టుగా పల్లవి అనాకారి, ఎబ్రాసి కాదు. ఛామన ఛాయలో, కొంచెం పొట్టిగా అనిపించినా కళగల ముఖమే... ఆ ముఖంలో కళ్ళు పెద్దవిగా వుండి ప్రశాంతంగా, నిర్మలంగా ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

ప్రపంచంలో తను తప్ప మరెవరూ అందంగా కనిపించరు తుషార కళ్ళకు .. చూసిన ప్రతివారికీ వంక పెట్టే తుషార స్వభావం నీరజకు బాగా పరిచయమే....

ఈ రకమైన అహంకారం భరించడం చాలా కష్టం కానీ, నీరజ భరిస్తుంది

కారణం . తన స్నేహం కోసం వచ్చే తుషారను తప్పుకు తిరగగల కాఠిన్యం లేదు నీరజలో.

తుషార ప్రతి ఉదయం కాలేజీకి వెడుతూ తప్పని సరిగా నీరజ ఇంటి ముందు కారు ఆపి .. నీరజకు లిఫ్ట్ ఇస్తుంది

అలా ప్రతిరోజూ తుషార కారులో కాలేజీకి వెళ్ళడం నీరజకు ఇష్టం వుండదు... కానీ ఇంటికి వచ్చిన తుషారను నొప్పించలేని సంస్కారం ...

నీరజది మధ్యతరగతి కుటుంబం

"అందమూ, చదువూ సామాన్యమే.

వయస్సు తెచ్చిన ఒంపు సొంపులతో చక్కని కనుముక్కు తీరుతో "ఫరవాలేదు" అనిపించే నీరజ తుషార ముందు మాత్రం వెలతెల పోతుంది.

తుషార ఇంత సామాన్యంగా వుండే తన స్నేహం కోరడంలో ఆంతర్యం నీరజకు తెలుసు-

తనలాగే డబ్బుగల వారి మధ్య అయితే అందరిలో తనూ ఒక్కతిగా మాత్రమే కనిపిస్తుంది.

కానీ, సామాన్యంగా వుండే వాళ్ళమధ్య అయితే తను మరింత ప్రత్యేకంగా కనిపిస్తుంది.

అదే తుషార కోరుకునేది.

అందుకే నీరజ స్నేహం కోసం ప్రాకులాడేది.. .

విషయం తెలిసినా, ఆంతర్యం ఏదైనా కానీ, తనకోసం వచ్చే తుషారను తప్పుకు తిరగ గలిగే తెలివితేటలూ, కఠినత్వమూ నీరజకు లేవు.

★ ★ ★ ★

కాలేజ్ టైమ్ అవుతూండటంతో రుబ్బుతూన్న పచ్చడిబండ తల్లి చేతికి ఇచ్చి బాత్‌రూంలోకి దూరింది నీరజ.

జడ అల్లుకూంటుండగానే తుషార కారు ఆగిన చప్పుడూ, ఆ వెంట వెంటనే రెండుసార్లు హారన్ చేసిన చప్పుడూ వినిపించి త్వరపడింది నీరజ.

"ఏయ్‌ఁ.. నీరజా! ఇంకా ఏం చేస్తున్నావ్...?" కారుదిగి దూకుడుగా వచ్చింది తుషార.

చీరకుచ్చిళ్ళు సవరించుకుంటున్న నీరజ నవ్వుతూ తలఎత్తి చూసింది స్కైబ్లూ కలర్‌శారీ, మాచింగ్‌బ్లౌజ్. మ్యాచింగ్ జ్యూయలరీతో మెరిసిపోతోంది తుషార

వినీల మేఘమాలికకు బంగారు జరీ అంచు కూర్చినట్లు ఆచ్ఛాదనలేని చోట్ల ఆమె బంగారు రంగు శరీరం పచ్చగా మెరిసిపోతోంది

మేఘకన్య ఒకర్తె ఆకాశంలో విహరించేందుకు వచ్చినట్లుందా క్షణంలో తుషార.

నీరజ తన చీర వంక చూసుకుంది.

తుషార డ్రస్ ముందు, తన చీర మంచిదే అయినా మరి మామూలుగా పేలవంగా కనిపించింది–

క్రొత్త జరీ చీర ముందు వెలిసిపోయిన నూలుచీరలా

"ఏయ్ నీరజా ఏమిటిచూస్తున్నావు.. .? శారీ బావుందికదూ. ? డాడీ ఫారిన్ నుండి తెప్పించారు ఈ జ్యూయలరీ కూడా ఫారిన్‌దే.. బాగా మ్యాచ్ అయ్యాయికదూ....?

"అహఁ... అలాగా . చాలా బావున్నాయి...."

"మీ హీరో ఇంట్లో లేరా. ..?

'ఎందుకూ ... ?"

"కంగారుపడకు... నీకు పోటీకి రానులే.. " తుషార నవ్వుతూనే అన్నా అందులో వినిపించే అతిశయం, అహంకారం తెలుస్తూనే వున్నాయి

"ఊరికే అడుగుతున్నాను .. అయినా నీరూ నువ్వు మీ బావ దగ్గర మరి సోదిగా కనిపిస్తావే.. "

అలా ముఖం పట్టుకు అంటుంటే నీరజకు బాధ అనిపించినా పైకి కనిపించకుండా నవ్వుతూ అంది, "అయినా నాకు దిగుల్లేదు... '

"ఏం. ? మారేజ్ సెటిల్ అయిపోయిందనా.. ?

"కాదు"

'మరి ?'

"నేనెలా వున్నా మా బావ కళ్ళకు రంభలా కనిపిస్తాను. అందుకు. .."

"ఇంపాజిబుల్. . నేను నమ్మను ..."

"నువ్వు నమ్మినా, మానినా అది అంతే...."

"నీకంటే అన్ని విధాలా ఉన్నతంగా వున్న అమ్మాయి పోటీకి వస్తే ...?"

"ఊహూ.... లాభంలేదు"

"ప్రేమించే హృదయం చాలు"

తుషారకు ఆ మాటలు సవాల్ అనిపించాయి.

"ఒకవేళ నేను నీకు పోటీకి వస్తే.....?"

"నువ్వుకాదుకదా సరాసరి ఆ దేవలోకం నుండి అప్సరస దిగివచ్చినా అంతే. ..."

తుషార అహం దెబ్బతింది.

"నీరూ! నన్ను రెచ్చగొట్టకు.... "

"రెచ్చ గొట్టడం కాదు.... నిజం చెబుతున్నానంతే. .."

"నేను నేరుగా ఏ మగాడి కళ్ళల్లోనైనా చూస్తే చాలు... ఎంతటి మగాడైనా కుక్కపిల్లలా నా వెంట పడాల్సిందే .. "

నీరజకు నవ్వు వచ్చింది.

వెనుకటి ఓ హిందీ సినిమా స్టార్ కూడా ఇలాగే ఇచ్చింది. ఓ స్టేట్‌మెంట్.

ప్రతి మగాడూ కేవలం అందాలకూ, ఆడంబరాలకే దాసుడైపోతే ఈ ప్రపంచంలో అనుబంధాలకూ, అనురాగాలకూ తావే వుండేదికాదు.. .

నిజమే ... తన బావ మంచి పర్సనాలిటీతో, అందమైన ముఖ వర్ఛస్సుతో సినిమా హీరోలా వుంటాడు. దానికి తోడుగా మంచి పొజిషన్‌లో కూడా వున్నాడు... అతను యూనివర్సిటీ గోల్డ్ మెడలిస్ట్. .

అయితే ఇవన్నీ తమ అనుబంధాలకు అడ్డురావు. బావకు తనంటే ప్రాణం... తనకు బావే ప్రపంచం తమమధ్య ఈ హెచ్చు తగ్గుల చర్చలకు అసలెప్పుడూ ఆస్కారంలేదు రాదు..... ఈ విషయం తుషారకు ఎలా తెలుస్తుంది. ..?

"ఏం . .? చల్లబడిపోయావ్...? భయం వేసిందా...? హేళనగా నవ్వింది తుషార.

స్త్రీ

సాగుతోంది కదాని
మరి మరి సాగదీస్తే
సాగి సాగి
ఒక్కసారి
పుటుక్కుమంటుంది
చేయి చురుక్కుమనిపిస్తుంది
రబ్బరే
సాగుతోంది కదాని
హృదయంలో కుంపటి రాజేస్తే
ప్రాణమున్న బొమ్మలా వాడేస్తే
సహనం చచ్చి చచ్చి
ఒక్కసారి
ఎదురు తిరుగుతుంది
మగాణ్ణి క్షణంలో దహిస్తుంది.
ఆడది!
ఖబడ్దార్!!

-ఎన్. పూజ

"లేదు.... ఓడిపోతావనుకుంటున్నాను....."

"ఛాలెంజ్ చేస్తావా... ?

స్టీరింగ్ వైపు చూపు నిలుపుతూ ఛాలెంజ్‌గా అడిగింది తుషార–

"ప్రయత్నించి చూస్తావా.....?" నవ్వింది నీరజ.

"వద్దు నీరజా! మళ్ళీ అనుకోనిది ఏదైనా జరిగితే నీకు బాధ... "

"తుషారా! అలా జరిగినా నా బావకు ఎన్నటికీ నేను వదులుకోను. అందం, డబ్బు, తెలివితేటలు స్వంతం చేసుకున్న ఓ కన్నెపిల్ల కవ్విస్తుంటే నిగ్రహించుకునేందుకు ఎంత మానసిక శక్తి కావాలో నాకు తెలుసు. కాబట్టి బావను నేను తప్పుపట్టను"

"కావచ్చు... కానీ, నా ప్రేమ నిజమే అనుకుని మీ బావ ప్రేమ పూజారిలా నా వెంట తిరుగుతూ దేవదాసులా మారితే....?"

ఎగతాళిగా నవ్వింది తుషార.

ఆ హేళన, ఆ అతిశయం నీరజ మనస్సును తాకాయి.

తుషార అహంకారం, అతిశయం ఆమెకు క్రొత్తకాదు....

కానీ, ఇలా తననూ తన బావనూ అవమానించడం సహించలేకపోయింది.

"తుషారా! అలా జరగదనే నా విశ్వాసం. అలాంటిదే జరిగితే మన పందెం విషయం చెప్పేదాం అప్పటికి అర్థం చేసుకోలేనంతటి మూర్ఖుడుకాడు బావ.

"ఒకె.... నీకే అంత ధైర్యం వున్నప్పుడు నేను వెనక్కు వెళ్ళలేను. కానీ, నీరజా! తరువాత బాధ పడి లాభంలేదు....."

"చెప్పానుగా.... ఇందులో బాధపడేందుకు ఏమీలేదని...."

"ఒ. కె..."

"ఒ.కె.. . విష్‌యూ గుడ్‌లక్...."

అప్పటి నుండే నీరజ బావ అజిత్ ఇంట్లో వున్న వేళల్లో తుషార రాకపోకలూ, పలకరింపులూ, నవ్వులూ, కబుర్లు ఎక్కువయ్యాయి.

చాలా ముక్తసరిగా వుండే అజిత్ ఆమెకు ఆశ్చర్యం కలిగించాడు. పరిస్థితి ఏమీ ఆశాజనకంగా కనిపించక పోవడంతో, ఏమైనా నీరజ ముందు ప్రొసీడ్ అవ్వలేక పోతున్నాడనే అభిప్రాయంతో అతనితో ఏకాంత సమావేశం అభిలషించింది తుషార.

ఒకరోజు అజిత్ నీరజతో సినిమా ప్రోగ్రాం వేసుకున్నాడు. అనుకోని విధంగా తయారయిన తుషారను చూసి అజిత్ కాస్త ఆశాభంగం చెందినా సభ్యత కోసం మరో మాట అనలేక పోయాడు.

ముగ్గురూ కలిసి సినిమాకు వెళ్ళారు.

అయితే ఒక్క అరగంటయినా గడవకుండానే నీరజ తలనొప్పి అంటూ ఇంటికి వచ్చేసింది.

అజిత్‌నూ, తుషారనూ సినిమా చూసి రమ్మని మరి మరి బలవంతపెట్టి.

★ ★ ★ ★

కారు దిగి లోపలికి వెళ్ళాడు అజిత్.

రెండుక్షణాలు కారులోనే కూర్చుని అతని వెనకే



లోపలికి వెళ్ళింది తుషార.

లోపలి గదిలో నుండి అజిత్, నీరజ మాటలు స్పష్టంగా వినిపిస్తున్నాయి.

"ఏయ్ నీరూ నీకేమయినా బుద్ధి వుందా ?"

ఏమిటి బావా ?"

"ఆ డెవిల్‌కి నన్ను అప్పగించివస్తావా. ?"

"ఏం జరిగింది...?"

"నీకు బుద్ధి లేదు... సరదాగా ఇద్దరం వెడదామంటే ఆవిడ నెందుకు రమ్మన్నట్లు . ?"

"అసలేం జరిగింది బావా ?" మెత్తగా అడిగింది నీరజ.

"తను నీకు ఫ్రండ్ ఏమోగా. అలా వాగుతుందేం ..?"

"ఏమంది . ?"

"ఆవిడకు తనో పెద్ద సుందరాంగిననీ, ప్రతి మగవాడూ తనను చూసి మతి పోగొట్టుకుంటాడనీ అహం "

"తుషార ఏమంది బావా ?"

"నీ మొహం అంది ... సరేనా .' కసురుకున్నాడు అజిత్.

"తుషార నిన్ను ప్రేమిస్తుందేమో బావా ..'

'ఆఁ .. అదే... అసలు మన ఇద్దరి విషయం తెలిసిన ఏ బుద్ధి వున్న ఆడదైనా అలా అడుగుతుందా. ..?" కోపంగా అంటున్నాడు అజిత్.

"తుషార సౌందర్యం, సంపదా వున్న అదృష్టవంతురాలు. . ఆమెను కాదనుకునే వాళ్ళు ఎవరుంటారు...? ఆమెతో పోలిస్తే నేనెక్కడ ..? నక్కకూ నాగలోకానికి వున్నంత తేడా . ఇద్దరికీ .'

"షటప్. బుద్ధి లేకుండా మాట్లాడకు " కసిరేశాడు అజిత్ అతను కసిరినట్లు మాట్లాడినా అందులో తొణికిన ఆప్యాయతను అందుకోగలిగిన నీరజకు హాయిగానే వుంది

"అసలు తనేమయినా క్రాకా..?" అనుమానంగా అడిగాడు

"ఛ .ఛ అదేం కాదు బావా. ఒకవేళ తుషార నిన్ను ప్రేమిస్తోందేమో "

అజిత్ సూటిగా చూశాడు నీరజ వంక

'నీరూ' అసలు నీకు నిజంగా తలనొప్పి వచ్చిందా ? లేపోతే నన్ను తనకు అప్పగించి త్యాగం చేస్తున్నాను అనుకుంటున్నావా ?'

నీరజ కళ్ళు వాల్చుకుంది

'చూడు నీరూ' ఆవిడగారు నన్ను ప్రేమించినా, తమరు నన్ను త్యాగం చెయ్యడానికి సిద్ధంగా వున్నా, నేను మాత్రం ఆవిడగార్ని ప్రేమించేందుకు సిద్ధంగా లేను

'తనకేం తక్కువ బావా. ?"

'ఏమీ తక్కువ లేదు .. ఒక్క బుద్ధి మాత్రమే ఛీ ఛీ అందం ఉండగానే, డబ్బు వుండగానే, చదువుకోగానే సరా . సంస్కారం ఉండొద్దూ.. ?"

తన బావకు బాగా కోపం వచ్చిందనే విషయం గ్రహించింది నీరజ కానీ, ఆమెకు చాలా సంతోషంగా వుంది. చల్లని వెన్నెల రాత్రి 'ఆకాశంలో విహరించినంత ఆనందంగా, హాయిగా వుంది.

"పోనీలే బావా .. సినిమా ఎలా వుంది.. ?"

'సినిమా చూసే ప్రాప్తం కూడానా ఆవిడగారి పయ్యారాల ప్రదర్శనే సరిపోతే .

అతని కోపం చూస్తున్న నీరజకు నవ్వు వచ్చింది పెద్దగా నవ్వేసింది

నీరూ' ఇలారా "

కఠినంగా వున్న అతని స్వరానికి బెదిరిపోయింది నీరజ బెదురుతూనే అతనికి దగ్గరగా నడచింది

'నీ తలనొప్పి మాట అబద్ధం కదూ ?'

"ఔను' అన్నట్లుగా తల ఊగించింది నీరజ భయంగా భయంతో ఆమె కళ్ళు రెపరెపలాడాయి. ఆమె భయాన్ని చూస్తున్న అతనికి నవ్వు వచ్చింది. కానీ ఆపుకున్నాడు

ఇలాంటి పిచ్చి పనులకు శిక్ష ఏమిటో తెలుసా ?'

'తెలీదు ' అన్నట్లుగా తల అడ్డంగా ఊపింది

మళ్ళీ మళ్ళీ ఇలాంటి పిచ్చి పనులే చేసి బావ చేత ఇలాంటి శిక్షలే వేయించుకోవాలి అనిపించేంత అందమైన శిక్ష వేశాడు అజిత్ ఇద్దరూ ఆ తన్మయత్వంలో నుండి తేరుకోక ముందే, వాకిట్లో కారు స్టార్ట్ అయిన శబ్దం వినిపించి ఉలిక్కిపడ్డారు.

"బావా' తుషార వెళ్ళిపోలేదా . ?"

"ఏమో నేను చూడలేదు .. కారు దిగి నేరుగా ఇంట్లోకి వచ్చేశాను" తమ మాటలన్నీ తుషార విన్నట్లుగా తెలుసుకుంది నీరజ ఆ తరువాత మరెప్పుడూ ఆ ఇంటి ముందు తుషార ఎర్రరంగు కారు ఆగలేదు □